# తెలుగుదనం వెల్లి విరిసిన తానా తెలుగుభాషా చైతన్యోత్సవం

మాతృరాష్ట్రమైన ఆంధ్ర ప్రదేశ్‌లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) 2006 డిసెంబర్ నెలలో చేపట్టిన కార్యక్రమాలు పూర్తిగా విజయవంతమయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగంటే నిరాసక్తంగా ఉన్న మన అన్నదమ్ముల్లో, అక్క చెల్లెళ్ళలో ఒక కదలికను తీసుకొచ్చి మాతృభాష, సంస్కృతులపట్ల ఒక చైతన్యాన్ని కలిగించాలనే లక్ష్యం ఈ కార్యక్రమాల వల్ల నెరవేరింది. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోనేగాక , ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారి, పుట్టినిల్లు అయిన ఆంధ్రదేశంలో కూడా అద్భుత కార్యక్రమాలు చేపట్టగలదని 'తానా' నిరూపించింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదులో ఉన్న రవీంద్రభారతిలో 'తానా' తెలుగు భాషా చైతన్యోత్సవాన్ని ఏర్పాటుచేసింది. ఈ ఉత్సంలో పాల్గొన్న ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు తెలుగు వారి కోసం, తెలుగు భాష కోసం 'తానా' చేస్తున్న కృషిని ప్రశంసించారు.

## డిసెంబర్ 15న రాష్ట్రమంతటా తెలుగు ఊరేగింపులు:

'తానా' చేపట్టిన తెలుగుభాషా చైతన్యోత్సవం 2006 డిసెంబర్ 15న ప్రారంభమైంది. అదే రోజున మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, కర్నూల్, కడప, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, ఉభయగోదావరులు, గుంటూరు, విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం, ఖమ్మం జిల్లాల్లో స్థానికంగా సంగీత, సాంస్కృతిక తెలుగు ఊరేగింపులు జరిపారు. తెలుగు భాషకు ప్రాచీన హోదా ఇవ్వాలి, తెలుగును పరిరక్షించుకుందాం అని నినాదాలిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. కొన్నిచోట్ల వివిధ డిమాండ్స్‌తో జిల్లా అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. మొత్తం మీద రాష్ట్రమంతటా ఒకే రోజున ఒకే విధంగా ఒకే స్వరంతో తెలుగు చైతన్యోత్సవాన్ని నిర్వహించుకోవడం ముదావహం. 'తానా' తో కలిసి ఈ కార్యక్రమాలను నిర్వహించిన వివిధ సంస్థలు బ్యానర్లు, ప్లకార్డులు, కరపత్రాలు, పత్రికల ద్వారా విస్తృత ప్రచారం కల్పించారు. రాష్ట్ర ప్రజల్లో ఈ కార్యక్రమం ద్వారా మంచి స్పందన కనిపించిందని పత్రికలు, ప్రసార మాధ్యమాలు ప్రశంసించాయి.

## డిసెంబర్ 29న 'మనభాష-మన భవిష్యత్తు' సదస్సు:

'తానా' కార్యక్రమాలకు హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విద్యాత్మక సహకారాన్ని అందిస్తోంది. ఈ విశ్వవిద్యాలయంలోని 'డా॥నందమూరి తారకరామారావు కళామందిరం'లో డిసెంబర్ 29న 'మన భాష మన భవిష్యత్తు' సదస్సు జరిగింది. హైదరాబాద్ నుంచే కాకుండా రాష్ట్రం వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు, తెలుగు అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలుగు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు డా॥ ఆవుల మంజులత అధ్యక్షత వహించారు. 'తానా' అధ్యక్షుడు డా. బండ్ల హనుమయ్య స్వాగతోపన్యాసం చేస్తూ, 'మాతృభాషపై ఉన్న అపారమైన ప్రేమాభిమానాలతో ఈ కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత కొన్నేళ్ళుగా, అంతరించిపోతున్న జానపద కళారూపాలను కాపాడేందుకు వివిధ పట్టణాల్లో కళా ఉత్సవాలు నిర్వహించామనీ, ఈసారి తెలుగుకు ప్రాచీనహోదా సాధన సదస్సు , ఇక్కడి వారిలో తెలుగుపట్ల ఆదరణ తగ్గిపోకుండా చేయడం వంటి లక్ష్యాలతో అనేక కార్యక్రమాలను తలపెట్టినట్టు' హనుమయ్య చెప్పారు. డాక్టర్ ఆవుల మంజులత అధ్యక్షోపన్యాసం చేస్తూ, 'మాతృభాష, కళల పరిరక్షణ అనేది అనివార్యమని, దీనికై మనలో సమిష్టి భావోద్వేగం రావాలని' ఆమె అన్నారు.

 భాషావేత్త ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి కీలకోపన్యాసం చేశారు. తర్వాత ఎ.బి.కె. ప్రసాద్, శ్రీ సి. ధర్మారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆచార్య చేకూరి రామారావు, డాక్టర్ కాలువ మల్లయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు, టంకశాల అశోక్, నాగసూరి వేణుగోపాల్, డాక్టర్ పోరంకి దక్షిణామూర్తి, ఆచార్య వేల్చేరు నారాయణరావు, తెలుగువన్.కామ్ చీఫ్ ఎడిటర్ మల్లిక్ తదితర ప్రముఖులు, వివిధ రంగాల్లో తెలుగు వర్తమాన స్థితి, దీన్ని మెరుగుపరుచుకునేందుకు తీసుకోవలసిన చర్యలపై ప్రసంగాలు చేశారు. తానా ఇండియా కార్యక్రమాల సమన్వయకర్త ఉదయకుమార్ చాపలమడుగు కార్యక్రమానికి సమన్వయ బాధ్యతలు నిర్వహించారు.

## సదస్సు తీర్మానాలు:

ఈ సందర్భంగా సదస్సు కొన్ని తీర్మానాల్ని అమోదించింది.

- 15 కోట మంది ప్రజలు మాట్లాడే తెలుగు భాష వాడుకను పరిపాలన, ప్రసార, విద్య, జనజీవన రంగాల్లో విస్తృతం చేసే క్రమంలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో కనీసం 5వ తరగతివరకు విద్యాబోధన మాతృభాషలోనే జరగాలి.
- ప్రపంచభాషల నడుమ తెలుగు తలెత్తుకుని మనుగడ సాగించడానికి కావలసిన చర్యల్ని తీసుకునేందుకు భాషా సాహితీవేత్తలు, ప్రముఖ విద్యావేత్తలతో ఒక ఉన్నతస్థాయి సంఘాన్ని ఏర్పాటుచేయాలి.

## హైదరాబాద్ వీధులలో తెలుగుయాత్ర

డిసెంబర్ 30వ తేదీ తానా, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, అధికారభాషాసంఘం సహకారంతో అతిముఖ్యమైన తెలుగు ఊరేగింపు కార్యక్రమం నిర్వహించింది. ఉదయం ఎనిమిది గంటలనుంచే హైదరాబాద్ నగర వీధులలో ఊరేగింపు సంరంభం నెలకొంది. ఊరేగింపులో పాల్గొనడానికి ఎంతోమంది కవులు, భాషాభిమానులు, కళాకారులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు, పాత్రికేయులు పబ్లిక్‌గార్డెన్స్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి చేరుకున్నారు. వివిధ జిల్లాల్లో డిసెంబర్ 15న ఊరేగింపులు నిర్వహించిన వారు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సినీ కళాకారులు, సాఫ్ట్‌వేర్ రంగానికి చెందినవారు, ఇతర సంస్థలవారు తరలివచ్చారు. తెలుగులో రాసిన ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని వీరు పబ్లిక్‌గార్డెన్స్ మీదుగా పోలీస్‌కంట్రోల్ రూమ్, ఆకాశవాణి, శాసనసభ మీదుగా రవీంద్రభారతి ప్రాంగణంలోకి ప్రవేశించారు.

తానా ఆలోచనలు, భాషాభిమానం మూర్తీభవించే విధంగా రవీంద్రభారతి అలంకరించారు. ఉదయం పదిగంటలకు ఆహుతులు వేదిక చేరుకున్నారు. తానా భారతదేశ కార్యక్రమాల సమన్వయకర్త తొలి పలుకులతో ముఖ్యమంత్రి డాక్టర్ వై. ఎస్. రాజశేఖరరెడ్డి, ఆర్థికశాఖ మంత్రి కె. రోశయ్య, ఉన్నత విద్యాశాఖమంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, అధికార భాషా సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎ.బి.కె. ప్రసాద్, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షురాలు డాక్టర్ ఆవుల మంజులత, తానా అధ్యక్షులు డాక్టర్ బండ్ల హనుమయ్య, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, సత్యం కంప్యూటర్స్ అధినేత బి. రామలింగరాజు, జ్ఞానపీఠ్ అవార్డ్ గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి, పుత్తూరు శాసనసభ్యులు గాలి ముద్దు కృష్ణమనాయుడు , సి.సి. రెడ్డి తదితరులు వేదికను అలంకరించారు.

తానా అధ్యక్షులు డాక్టర్ బండ్ల హనుమయ్య స్వాగతోపన్యాసం చేశారు. ప్రవాసాంధ్రుల అంతరంగాన్ని, తెలుగు కాపాడుకోవాలన్న ఆశయాన్ని ప్రతిబింబించేలా ఈ ఉపన్యాసం సాగింది. అమెరికాలో తానా నిర్వహిస్తున్న కార్యక్రమాలు ముఖ్యంగా తెలుగు రాష్ట్రంలో తెలుగుకు కలుగుతున్న నిరాదరణపై కలతచెందుతున్నామని, తాము మాత్రం తెలుగును కాపాడుకునేందుకు అనేక విధాలుగా పాటుపడుతున్నామని చెప్పారు. ఆనాడు తామందరమూ తెలుగు మాధ్యమంలోనే చదువుకున్నామని, విదేశాల్లో అవకాశాలు దక్కించుకున్నామని, తెలుగులో చదువుకుంటే అవకాశాలు రావనేమాట వాస్తవం కాదని హనుమయ్య అన్నారు.

## ధర్మారావుకు గిడుగు రామమూర్తి అవార్డు

తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు సి. ధర్మారావుకు తానా పక్షాన ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి గిడుగు రామమూర్తి స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. 2002వ సంవత్సరంలో ప్రకటించిన 'సామాజిక సేవా - జీవితకాల సాఫల్య' పురస్కారాన్ని అప్పట్లో అందుకోలేకపోయిన శ్రీమతి హేమలతాలవణం తరుపున ఈ వేదికపై ప్రముఖ మానవవాద ఉద్యమ నాయకుడు లవణం ఆ అవార్డు అందుకున్నారు.

## తెలుగు భాషను విస్మరించవద్దు: వై.ఎస్.

సభలో జ్ఞానపీఠ్ అవార్డ్ గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్రంలో తెలుగు వర్తమాన స్థితిగతులను వివరించారు. తెలుగు ప్రాచీన భాష హోదా కోసమే కాకుండా తెలుగు భాష అభ్యున్నతి కోసం అధికార భాషాసంఘం, తెలుగు విశ్వవిద్యాలయం, ఆంధ్ర సారస్వత పరిషత్తులతో తనవంతు కృషిచేస్తున్నానని ఆయన చెప్పారు. 5వ తరగతి వరకు కచ్చితంగా, పూర్తిగా ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలలు అనే తేడా లేకుండా అన్నిచోట్లా మాతృభాషలోనే విద్యాభ్యాసం సాగాలి అని ఆయన సూచించారు.

ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషకోసం ఇక్కడకు వచ్చి, అనేక కార్యక్రమాలను చేపడుతున్న తానా ప్రతినిధులను అభినందించారు. "ఉపాధి అవకాశాల కోసం ఆంగ్లభాష నేర్చుకోవడం తప్పుకాదు. మాతృభాషను పక్కకు తోసివేయడం మాత్రం వాంఛనీయం కాదు" అని ఆయన అన్నారు. "తెలుగుకు ప్రాచీన హోదా ఇవ్వాలని కేంద్రమంత్రి అంబికా సోనీని, ప్రధానమంత్రినీ కలిసి విజ్ఞప్తి చేశాం. శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేశాం. దీనిని సాధించేందుకు కృషి కొనసాగిస్తా"మని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇంటర్‌లో మార్కుల కోసం సంస్కృతం, హిందీ తీసుకోవడాన్ని అడ్డుకుంటామని వచ్చే విద్యా సంవత్సరం నుంచి తెలుగును తప్పనిసరి చేస్తామని హర్షధ్వానాల మధ్య చెప్పారు.

ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. తెలుగు వెలుగులు, గాంధీజయంతి, తల్లిఒడి తదితర కార్యక్రమాలు జరిగాయి. 30వ తేదీ సాయంత్రం జరిగిన ముగింపు సభలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రపంచంలో ముఖ్యంగా అమెరికాలో తెలుగువారు గణనీయంగా ఉన్నత స్థానాల్లో ఉంటూ తెలుగు జాతికి పేరు తెస్తున్నారని అన్నారు. తెలుగుకు ప్రాచీన స్థాయి కల్పించేందుకు తగిన అర్హతలన్నీ ఉన్నాయని, దానికోసం తమ పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆయన చెప్పారు. స్వదేశంలో భాషాభ్యుదయం కోసం తానా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

తానా పూర్వ అధ్యక్షులను, ప్రస్తుత కార్యవర్గసభ్యులను, భాషా చైతన్యోత్సవం, గుంటూరులో జరిగిన జానపద కళోత్సవం, విశాఖలో జరిగిన వికలాంగుల కళోత్సవాలను నిర్వహణలో తోడ్పాటునందించిన వారిని తానా పక్షాన చంద్రబాబునాయుడు సత్కరించారు. తానా భారతదేశ కార్యక్రమాల సమన్వయకర్త చాపలమడుగు ఉదయకుమార్ వందన సమర్పణ చేశారు.

### వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు

విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తానా నిర్వహించిన వ్యాసరచనపోటీల విజేతలకు మొదటి బహుమతి పదివేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా ఎనిమిదివేలు, తృతీయ బహుమతిగా అయిదువేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక సంచికను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు.